## క్లుప్తంగా

### పాత భవనాల కూల్చివేత



బాగ్‌అంబర్‌పేటలో కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

అంబర్‌పేట: ప్రమాదకరంగా ఉన్న పురాతన భవనాలపై జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాకాలంలో పురాతన భవనాలతో ప్రమాదం ఉంటుందని వాటిని తొలగిస్తున్నారు. దీనిలో భాగంగానే బుధవారం గోల్నాక కృష్ణానగర్, బాగ్‌అంబర్‌పేట అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న పురాతన భవనాలను కూల్చివేశారు. ఈ కూల్చివేతలను టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సాయిబాబా, అధికారులు శ్రీధర్, రజ్వీ తదితరులు పర్యవేక్షించారు.

### పంచాయతీ కార్మికుల పోరాటాన్ని పట్టించుకోండి

ముషీరాబాద్: పంచాయతీ కార్మికుల పోరాటాన్ని పట్టించుకోవాలని సీపీఐఎంఎల్ ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. గత 14 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా ప్రభుత్వం కుటిలత్వం ప్రదర్శిస్తోందని ఆయన ఆరోపించారు. మంత్రి ఎర్రవెల్లి, సీఎం కేసీఆర్ కార్మికులను చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులపై చిన్నచూపు చూస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 11వ వేతన సంఘం సిఫారసును అమలు చేయడం లేదని తెలిపారు. వెంటనే పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### వరదలో కార్మికశాఖ కమిషనరేట్ ప్రాంగణం

చిక్కడపల్లి: రెండు రోజుల వర్షానికే ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయ ప్రాంగణం చెరువును తలపిస్తోంది. కార్యాలయం ప్రధాన గేట్ వద్ద చిన్న వర్షానికే నీరు నిలిచిపోతోంది. వాహనాల రాకపోకల వల్ల నీరు నడిచి కార్యాలయంలోకి వచ్చే వారిపై పడుతోంది. కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద వరకు నీరు నిలిచి కార్యాలయానికి వచ్చే కార్మికులకు ఇబ్బందిగా మారుతోంది. ఎస్టేట్ అధికారి ఈ సమస్యను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.

### బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలి




కాచిగూడ: రాష్ట్ర జనాభాలో 54శాతం ఉన్న బీసీలకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు 50శాతం టికెట్లు కేటాయించాలన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న పార్టీలు టిక్కెట్ల కేటాయింపులో మొండిచేయి చూపుతున్నాయని విమర్శించారు. బీసీలను విస్మరించే పార్టీలకు గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. బీసీ మహాసభ నేతలు కృష్ణ ముత్యాలరావు, ప్రశాంత్, ప్రదీప్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

### అఖండ 'కాణ్వశాఖ' ఘన పారాయణ మహోత్సవం

కాచిగూడ: భవిష్యత్ తరాలకు వేద విజ్ఞానం అందించాల్సిన అవసరం ఉందని బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతా మూర్తి అన్నారు. చిరంజీవి బ్రహ్మశ్రీ ఘనాపాఠి కె.అనిరుద్‌శర్మచే శుక్ల యజుర్వేద అఖండ 'కాణ్వశాఖ' ఘన పారాయణ మహోత్సవాన్ని బుధవారం కాచిగూడలోని తుల్జాభవన్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలో ఇలాంటి 'శుక్ల యజుర్వేదం' గత 100 ఏళ్లుగా ఎవరూ చేపట్టలేదన్నారు. 26 రోజుల పాటు జరిగే ఈ పారాయణం ప్రస్తుతం నిలిచిపోతుందన్నారు. సహస్రావధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ, శ్రీపురానిక్, బ్రహ్మశ్రీ శ్రీనివాస బంగారయ్య శర్మ, నరేంద్ర కాప్రే, గిరీష్ కులకర్ణి, సంతోష్‌శర్మ, కిషోర్‌లతో పాటు 100 మంది యువ వేద పండితులు పాల్గొన్నారు.



ఘన పారాయణం చేస్తున్న కె.అనిరుధ్‌శర్మ

# నట్టల నివారణకు సర్వం సిద్ధం

## నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

- చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం
- 19 ఏళ్లలోపు ఉన్నవారే బాధితులు
- పిల్లలకు ఉచితంగా మాత్రల పంపిణీ

బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయడం, చెప్పులు లేకుండా తిరగడం, భోజనం చేసేముందు, తర్వాత చేతులు శుభ్రపరచుకోకపోవడంతో చాలామంది చిన్నారులు తరుచూ అనారోగ్యానికి గురవుతున్నారు. కడుపునొప్పి, విరోచనాలు, తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. కడుపులో నులి పురుగుల కారణంగా అనేక అనారోగ్య సమస్యలతో పిల్లలు సతమతమవుతున్నారు. ఇది శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది.



నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న సిబ్బంది




ఆల్బెండజోల్ మాత్రలు

కాచిగూడ: ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం ఎక్కువ మంది బాధపడే సమస్యల్లో నులి పురుగుల సమస్య ఒకటి. పసిపిల్లల్లో ఈ సమస్య తీవ్రత మరీ అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో నులి పురుగులను నివారించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జాతీయ నులి పురుగుల (నట్టలు) నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 20 న గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆల్బెండజోల్ టాబ్లెట్లను ఉచితంగా అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను చేశారు.

**అసలెందుకు వస్తాయి ?**

అపరిశుభ్ర వాతావరణం, మురికి కాలువలు, నిల్వ ఉన్న నీళ్లు, జంతువుల మలం తదితర వ్యర్థాలు నులి పురుగుల వ్యాప్తికి కారణం. ఇంటి పరిసరాల్లో చెత్త పేరుకుపోవడం వల్ల ఈ సమస్య త్వరగా వ్యాప్తి చెందుతోంది. భోజనానికి ముందు చేతులు కడుక్కోకపోవడం, చెప్పులు లేకుండా తిరగడం, పిల్లలు మట్టిలో ఆడి చేతుల్నే నోట్లో పెట్టుకోవడం కూడా ఈ సమస్యకు మూలమే.

**లక్షణాలు ఎలా ఉంటాయి ?**

నులి పురుగులు పొట్టలో చేరి.. ఆపై మలద్వారం వద్ద గుడ్లు పెడతాయి. దీంతో అవి కదిలినప్పుడు దురద ఉంటుంది. తెల్ల మచ్చలు కనిపిస్తాయి. వాటి సంఖ్య అధికమైతే పొట్టనొప్పి, అజీర్ణంతో పాటు వాంతులు, విరేచనాలు, కొన్ని సందర్భాల్లో రక్త హీనత లాంటివి తప్పవు. వాటితో పాటూ వృద్ధి చెందే ఇతర క్రిముల వల్ల శక్తి క్షీణించడం, శారీరక ఎదుగుదల ఆగిపోవడం.. వంటివి ఎదురౌతాయి. కొంతమందిలో కాళ్లు, ముఖం వాపు ఉంటుంది. ఈ సమస్య ఉన్నదీ లేనిదీ మలపరీక్షతో తెలుసుకోవచ్చు. సమస్య తీవ్రంగా ఉంటే మలంలో క్రిములు కనిపిస్తాయి.

**పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది..**

నులి పురుగులు పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. పిల్లల్లో జ్ఞాపకశక్తి తగ్గి అనేక సమస్యలు పట్టి పీడిస్తాయి. నులి పురుగుల నివారణ కోసం ఏడాదికి రెండుసార్లు 1–19 ఏళ్లున్న పిల్లలకు ఆల్‌బెండోజోల్ మాత్రలను ప్రభుత్వం అందిస్తోంది.

**వ్యాపిస్తాయి ఇలా..**

ఏలిక (నట్టలు) పాములు, నులిపురుగులు, కొంకి పురుగులు అనే మూడు రకాల క్రిములు ఉంటాయి. నులి పురుగులు మానవుడి పేగు నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు. ఇవి అపరిశుభ్రత, పరిసరాలతో చిన్నారుల కడుపుల్లోకి చేరతాయి. ఇవి నేలలో గుడ్లు, లార్వాలుగా వృద్ధి చెందుతాయి. పిల్లలు మట్టితో ఆడుకోవడం, చేతులు కడుక్కోకుండా ఆహారం తీసుకోవడం ద్వారా కడుపులోకి వెళ్తాయి. అదే విధంగా వర్షాలు కురిసినప్పుడు పంట పొలాలకు చేరతాయి. కూరగాయలు, ఆకుకూరలు, వీటి గుడ్లతో కలుషితమవుతాయి. నీటిని శుద్ధి చేయకుండా తాగడం వల్ల నేరుగా కడుపులోకి వెళ్తాయి.

### నివారణ చర్యలు...



- పరిసరాల పరిశుభ్రతతో పాటు గాలి, వెలుతురు దారాళంగా వచ్చేలా చూసుకోవాలి.
- కాచి, చల్లార్చిన నీరు తాగాలి. గోళ్లను శుభ్రంగా, చిన్నవిగా ఉంచుకోవాలి. ఎల్లప్పుడూ పరిశుభ్రమైన నీటినే తాగాలి.
- ఆహారంపై మూతలు కప్పి ఉంచాలి. పండ్లు, కూరగాయలను శుభ్రమైన నీటితో కడిగి తినాలి.
- భోజనం చేసే ముందు, మలవిసర్జన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయవద్దు.
- వేడివేడి ఆహారాన్నే తీసుకోవాలి. మాంసాహారం అప్పుడు వండినదే తినాలి. పిల్లలకు తీపి పదార్థాలు, చాక్లెట్లు, మలబద్ధకానికి కారణమయ్యే మైదా పిండి పంటలు బాగా తగ్గించాలి.
- తాజా ఆకుకూరల్ని ఉప్పునీరు లేదా గోరు వెచ్చటినీటితో వండాలి. కూరగాయలు, పండ్లు, శుభ్రంగా కడిగాకనే వినియోగించాలి.

– కవ్వాడపు బాల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కాచిగూడ సెక్టార్

### ప్రతి ఒక్కరూ కృషి చేయాలి..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: నులిపురుగు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అన్నారు. కాచిగూడ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం కాచిగూడలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ .. 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు వైద్య సిబ్బంది ఆల్ బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు.

- ఏడాది లోపు పిల్లలకు సగం మాత్ర పొడిచేసి వేయాలని, 2–5 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర వేయాలన్నారు. 6–19 ఏళ్ల వరకు ఒక మాత్రను నోట్లో వేసుకుని చప్పరించాలన్నారు. నులిపురుగుల సమస్యతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతారని, రక్తహీనత, జ్ఞాపకశక్తి తగ్గడం, పోషకాహారలోపం బారిన పడతారన్నారు. కన్నె రమేష్‌యాదవ్, నర్సు బాయి, ఇందిర, సబిత, రాజ్‌కుమార్, బీమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కోర్సులను ప్రవేశపెడతాం



ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, ఆచార్య కృష్ణారావు తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో బాగ్‌లింగంపల్లిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో కొత్తకోర్సులు ప్రవేశపెట్టనున్నట్లు ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, మహాత్మగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణారావులు తెలిపారు. బుధవారం అంబేడ్కర్ కళాశాలలో బిజినెస్ లాజిస్టిక్స్ అసోసియేషన్ స్కేల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఓయూ, కేయూ, మహాత్మ గాంధీ విశ్వవిద్యాలయాల) లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ కోర్సులకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నత విద్యామండలి అందిస్తున్న సహకారంతో యూనివర్సిటీల పరిధిలోని కళాశాలల్లో సరికొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామన్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ డాక్టర్ మహమూద్, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్, ప్రొఫెసర్ యాదగిరి, మహాత్మ గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణారావు, గణేషన్, ప్రొఫెసర్ సుబ్బారావుల సమక్షంలో ఒప్పందం జరిగింది. కళాశాల కార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'నిరుద్యోగులను మోసం చేసిన కేంద్రం'



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ: విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ భృతిగా రూ.9 వేలు చెల్లిస్తామని బీజేపీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం దోమలగూడ లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయవాదాన్ని వాడుకుంటూ.. యువతను తప్పుదోవ పట్టిస్తుందని ఆయన విమర్శించారు. దేశంలోని యువత ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య నిరుద్యోగమని నాణ్యత, సామర్థ్యం, ఉత్సాహం, పనిపై అభిరుచి యువతకు ఉన్నా ఉపాధి దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, డాక్టర్ అన్సారీ, ఎండీ మాజీద్‌లు పాల్గొన్నారు.

**నూతన కమిటీ..**

➡ ఆప్ యువజన విభాగం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సర్దార్ రణధీర్‌సింగ్ రానా, కార్యనిర్వాహక అధ్యక్షులుగా విజయ్‌మల్లంగి, ఉపాధ్యక్షులుగా బాబులాల్ పవన్, శ్రీనివాస్, శనోజ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల సంతోష్, కార్యదర్శిగా ఎండీ జానీ, సంయుక్త కార్యదర్శులుగా కుట్టి అశోక్‌బాబు, ఎండీ షాజ్, కోశాధికారిగా ఎండీ అఫ్రోద్దీన్, అధికార ప్రతినిధిగా అజయ్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నియామకం



పులి నారాయణముదిరాజ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కాచిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శిగా పులి నారాయణముదిరాజ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అందజేశారు. బుధవారం బర్కత్‌పుర పార్టీ నగర కార్యాలయంలో గౌతమ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ అనుబంధ మోర్చా కమిటీలను మరింత బలోపేతం చేసేందుకు పార్టీ నేతలు కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీల సంక్షేమం, అభివృద్ధికోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్, ఆనంద్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్యామ్‌రాజ్, యశ్వంత్, నాగభూషణ్, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్..

### రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి..

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (35) బుధవారం ఉందానగర్ – తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**చికిత్స పొందుతూ మరో వ్యక్తి..**

కాచిగూడ: రైలు ఢీకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం.. సుమన్ (22) కూలీ పనిచేస్తుంటాడు. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

**మృతదేహం లభ్యం..**

కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వృద్ధుడు (70) మృతదేహాన్ని బుధవారం కాచిగూడ రైల్వేస్టేషన్ వెనుక వైపున స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


**ఫుట్‌పాత్‌పై మరో వ్యక్తి..**

చిక్కడపల్లి: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దోమలగూడ పోలీసులు తెలిపారు. బుధవారం ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తూట్ ఫిన్‌కాన్ ఫైనాన్స్ ఆఫీస్ దగ్గర అశోక్‌నగర్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి(40) పడిఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి గురించి విచారించగా ఎలాంటి ఆచూకీ లభించలేదు. నలుపు చుక్కలున్న తెలుపురంగు చొక్కా, నలుపు ప్యాంట్ ధరించి ఉన్నాడని మృతుడి మణికట్టుపై అమ్మ అని పచ్చబొట్టు, ఓం సింబల్ ఉన్నదని వివరించారు. ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

### వ్యక్తి అదృశ్యం..

నల్లకుంట: ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట అరవపల్లి కొమ్ముల గ్రామానికి చెందిన బాలగోని నరసింహ(42) జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. శంకరమఠం పద్మాకాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనికికుదిరిన అతరె కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఈ నెల 15న ఉదయం 8 గంటల సమయంలో భార్య నిర్మల గదిలోకి వెళ్లి చూడగా భర్త కనిపించలేదు. దీంతో కుమారుడు ఉపేందర్‌కు విషయం తెలపింది. తెలిసిన వారు, బంధువులను ఆరా తీసినా అతడి ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ పనిచేయకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బుధవారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రాంతాలకు అతీతం బాలు గానం



చిక్కడపల్లి: ప్రఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానం ప్రాంతాలకు అతీతమని ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. త్యాగరాయగానసభలో బుధవారం ప్రగతి మహిళా సామాజిక సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బాలసుబ్రహ్మణ్యానికి నివాళిగా 'స్వరగీత ఝరి' శీర్షికన గాయనీగాయకులు సినీగీతాలు గానం చేశారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ.. తెలుగు మాత్రమే కాకుండా తమిళ, కన్నడ, మలయాళీ, హిందీ తదితర భాషలో ఆయన పాడిన పాటలు తమవాడేనని అనుకుంటారన్నారు. సంస్థ అధ్యక్షుడు సుధారాణికృష్ణంరాజు, ఇంద్రసేన, సర్పంచ్ జ్యోతిచంద్రశేఖర్, ప్రతాప్ మల్లాది, సంస్థ కార్యవర్గసభ్యులు అన్వేష్‌కుమార్, నాగేందర్, కె.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

- ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శంకర్



నల్లకుంట: వర్షాకాలంలో బాక్టీరియా, వైరస్‌ల వల్ల సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ కాలంలో వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా డయేరియా, డెంగీ, వైరల్ ఫీవర్స్ వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. శంకర్ కోరారు. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన బుధవారం సాక్షి ఇంటర్వ్యూలో సూచించారు.

**సాక్షి : సాధారణంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధులేవి ?**

డాక్టర్: వర్షాకాలంలో విష జ్వరాలు ప్రబలుతాయి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వ్యాధుల ప్రభావం ఉంటుంది. దోమ, వైరస్, బాక్టీరియాలతో వ్యాధులు సోకే అవకాశం అధికంగా ఉంది.

**సాక్షి: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి ?**

డాక్టర్: ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులన్నీ ప్రాణాంతకాలే. వీటిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పడుకొనేటప్పుడు దోమల బెడద లేకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. తాగునీటి పాత్రలపై తప్పనిసరిగా మూతలు పెట్టి ఉంచాలి. కాచి చల్లార్చి వడకట్టిన నీటిని తాగాలి. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి.

**సాక్షి: ఎలాంటి ఆహారం తీసుకోవాలి ?**

డాక్టర్: ఈ సీజన్‌లో రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి. వీటిలో సీ విటమిన్ ఉన్న పదార్థాలు నిమ్మ, నారింజ, జామ, టమాటాలు, వెల్లుల్లి, పుట్ట గొడుగులు, పెరుగు, అల్లం, మెంతులు, బార్లీతో తయారు చేసిన పదార్థాలను అధికంగా తీసుకోవాలి. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. ఆహార తయారీ పాత్రలపై మూతలు పెట్టాలి.

**సాక్షి: ఏ ఏ పదార్థాలు తినకూడదు ?**

డాక్టర్: నిల్వ ఉంచిన మాంసం, చేపలు, ఈగలు వాలిన పదార్థాలు తినకూడదు. ఇవి తింటే వాంతులు, విరోచనాలు అయ్యే ప్రమాదం ఉంది.

**సాక్షి: ఆహారపదార్థాలు వండినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?**

డాక్టర్: ఆహార పదార్థాలు వండటం, తినేముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి.

**సాక్షి: ఎవరికైనా వాంతులు, విరోచనాలైతే ముందుగా ఎవరిని సంప్రదించాలి?**

డాక్టర్: ప్రతి బస్తీలోనూ బస్తీ దవాఖానాలు అందుబాటులో ఉన్నాయి. అక్కడికి వెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. అవసమైతే ఫీవర్ ఆసుపత్రికి రావొచ్చు. ఇక్కడ 24 గంటలు రోగులకు వైద్యం అందుబాటులో ఉంటుంది. రెండు, మూడు రోజులకు మించి జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

### బ్యాంకులను ప్రైవేటీకరిస్తే ఉద్యమం




కాచిగూడ: దేశ ఆర్థికవ్యవస్థలో ప్రభుత్వ బ్యాంకులు కీలకపాత్ర పోషిస్తున్నాయని వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రప్రభుత్వం పూనుకుంటే ప్రజలతో కలిసి జాతీయస్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని 'ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్' రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అప్పస్వామి, కార్యదర్శి నాగేశ్వర్ స్పష్టం చేవారు. 55వ బ్యాంకుల జాతీయకరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నారాయణగూడలో వారు మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి ప్రజలకు ప్రభుత్వ బ్యాంకింగ్ సేవలు అందేలా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. బ్యాంకులు జాతీయకరణం చేసిన తర్వాత అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వరంగ బ్యాంకులు తోడ్పాటును అందించాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాన్ఫెడరేషన్ ప్రతినిధులు రాజ్‌కుమార్, సతీష్, వెంకన్న, ఆంజనేయ ప్రసాద్, విక్రమ్, క్రిష్ణంరాజు, హనుమంతరావు, భీమ్‌సింగ్, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 46ను రద్దు చేయాలి



కవాడిగూడ: జీవో నెంబర్ 46ను రద్దు చేసి టీఎస్‌ఎస్పీ పోస్టులను రాష్ట్రస్థాయి పోస్టులుగా గుర్తించి అభ్యర్థులకు న్యాయం చేయాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు.

- జీవో 46తో గ్రామీణ నేపథ్యంలో జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతకు తీవ్రంగా నష్టం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఇందిరాపార్కు వద్ద బుధవారం ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, అభ్యర్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీ.హెచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ అమరవీరుల ఆశయసాధన జేఏసీ చైర్మన్ మురళీధర్‌దేశ్‌పాండే, యూనివర్సిటీ జేఏసీ నేత రాజునేత హాజరై మద్దతు ప్రకటించారు. టీఎస్‌ఎస్పీ అభ్యర్థుల విషయంలో న్యాయం చేయని పక్షంలో వారు చేసే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అభ్యర్థులు అనిల్, మధు, కరుణాకర్, గౌతమ్, బద్రీతో పాటు వందలాది మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌కేవీలోకి చేరికలు

కవాడిగూడ: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గోపాల్ యూనియన్‌కు చెందిన 20 మంది యూనిట్ సభ్యులు బీఆర్‌ఎస్‌కేవీలో చేరారు. బుధవారం స్వచ్ఛ గ్రేటర్ తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బండారి యాదగిరి ఆధ్వర్యంలో యూనియన్‌లో చేరారు. ఎల్‌బీ నర్సింహ్మా, స్వామి, కొమురయ్య, రాజలింగం, ఎండీగౌస్, జె.రాకేష్‌కుమార్, నర్సింగ్‌రావు, ఈదయ్య, కే.కృష్ణ, ఈ.పోచయ్య పాల్గొన్నారు.